తెలీని భయంకరమైన ఆకారం ఏదో తరుముతోంది ...

చీకట్లో ఒక్కదాన్నే పరుగు తీస్తున్నా....

ఆ ఆకారం దగ్గరవుతున్నకొద్దీ పరుగు వేగం కూడా పెరుగుతోంది.

ప్రాణభయంతో గుండెలదిమిపెట్టుకుని ఆయాసపడుతూ, రొప్పుతూ ... ముందుకు ఉరుకుతున్నా ... నా కాళ్లకు అంత బలం ఎలావచ్చిందో? ఎంత వేగంగా కదులుతున్నాయంటే వాటి స్పర్శ కూడా నాకు తెలీనంతగా ... నేను కేవలం గాలిలో స్పీడ్‌గా తేలుతూ పోతున్నట్టుగా ...!

ఇంతలో అనుకోని ఘోరం జరిగిపోయింది.

# చిన్నగీత

ఆర్. దమయంతి



ఎత్తయిన కొండ చివర్న నా ఆఖరి అడుగుతో లోయలోకి జారిపోతున్నా ....

అదీ తలకిందులుగా ... నా గుండాగిపోయింది మరో క్షణంలో నేను మృత్యువాత పడుతున్నానని తెలిసి .....

అంత చీకట్లోనూ కళ్లు మూసుకుని గట్టిగా చావుకేక వేశాను!

***

చచ్చేంత భయంతో లేచి కూర్చున్నా.

కల ... పీడ కల.... 'హబ్బ!' శరీరం సన్నగా వణుకుతోంది.

చీర చెంగుతో ముఖాన చెమటను తుడుచుకుంటూ చిన్నగా, గుండె ఎడమవైపు చేత్తో



గడప గడపకీ మొక్కి 'అమ్మా! అయ్యా! మా వస్తువులు కొనండి, నాయనా!' అని అడుక్కోవాలి. అలా అడుక్కోటానికి పోతానంటే ఫో! నీ మొగుడు చచ్చాడని ఫో!" అన్నారు.
ఆయన బాధని అర్థం చేసుకున్నా. కళ్లెంట నీళ్లు తిరిగాయి.

రుద్దుకుంటూ మెల్లగా లేచి బయటకొచ్చాను.

మధ్యాహ్నం ఎండ కాస్తోంది.

బయటకొచ్చి గేటు తీసుకుని, అక్కడే గన్నేరు చెట్టుకింద కూర్చున్నా. నీడలో చల్లగా అనిపించింది. కొన్ని క్షణాల తర్వాత రిలీఫ్ ఇచ్చింది.

ఈమధ్య అన్నీ ఇలాంటి కలలే వస్తున్నాయి, భయపెట్టేస్తున్నాయి. కారణం నాకు తెలుసు ... అభద్రత... ఇన్‌సెక్యూరిటీ ఫీలింగ్స్ బాగా వెన్నాడుతున్నాయి. ఇది ఫోబియా కాదు, ఫాక్ట్! రేపు ఏమవుతుందో తెలియని పరిస్థితి!

రేపటివరకు ఎందుకు? ఈ రోజే ... తిండికి తప్ప, ఆ పైన పైసా ఖర్చు ఎక్కువైనా మోసే శక్తి తన కుటుంబానికి లేదు.

ఆయన్ని సడెన్‌గా ఉద్యోగంలోంచి తీసేశారు. కంపెనీ నష్టాల్లో ఉందంటూ మూసేశారు. నిర్దాక్షిణ్యంగా రెండువేలమందిని గెంటేశారు. నష్టపరిహారంగా ఇచ్చిన మొత్తం ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో కొన్న కొన్ని వస్తువులకి కట్టేశాం. మిగిలింది మళ్లీ ఉద్యోగం దొరికేదాకా పెట్టుకుని తిన్నాం. అంతా అయిపోయింది.

ఆయనకు ఉద్యోగం వచ్చింది. నెలకు నాలుగు వేలు. వెయ్యిన్నర లేనిదే ఈ సిటీలో ఇల్లే లేదు... ఇద్దరు పిల్లలతో రెండు గదుల ఇల్లయినా రావొద్దూ ... ?

ఇంతకుముందంటే కంపెనీ క్వార్టర్స్ ఇచ్చింది. ఇప్పుడో? ఇంటద్దె, కరెంటు, నీళ్ల పంపు .... నెల తిరిగేసరికి ... 'అమ్మో' అనిపిస్తోంది.

పిల్లల్ని చూస్తే పెరిగిన పొట్ట, ఎదిగిన బట్టలా అంతకంతకూ వాళ్లకింద ఖర్చులు పెరిగిపోతున్నాయి. టెన్త్ క్లాస్, ఇంటర్మీడియెట్ నుంచే కంప్యూటర్ కోర్సులు చెప్పించాల్సొస్తోంది .... వందల్లో కాదు ... వేలల్లో ఖర్చు!

ఇంతకుముందంటే రోగం వచ్చినా, రొచ్చొచ్చినా కంపెనీ భరించేది. ఇప్పుడో?! గొంతు ఇన్‌ఫెక్షనొచ్చినా, ఒళ్లు నొప్పులయినా, చివరికి ఫ్లూ, మలేరియా అయినా నేను డాక్టర్ దగ్గరకెళ్లడం మానేశా ... పర్స్ చూసినందుకే ఏభైలూ, వందలూ! అవుంటే కూరకో నారకో వస్తుందనీ ...

అప్పుడంటే కంపెనీ లోన్‌లు దొరికేవి. పిఎఫ్ అనీ, ఫెస్టివల్ అడ్వాన్స్‌లనీ, బోనస్‌లనీ, ఎడ్యుకేషన్ లోననీ ... ఇప్పుడేవి అవన్నీ? ఆయన 'పే స్లిప్' చూసి పెద్ద మొత్తాల్లో బయట అప్పు దొరికేది. ఇప్పుడో? ... ఏమీ లేదు.

ఓనర్ కిష్టమొచ్చినప్పుడిచ్చే ఆ జీతం రాళ్లు తప్ప ఏమీ లేదు ...

రేపు ఎలా బతుకుతాము?

ఈ సమస్యలన్నీ ఎలా తీరతాయి?

ఆయనకేదైనా జబ్బు చేసో, నలత చేసో నాలుగు రోజులు ఆఫీసుకెళ్లకపోతే అన్నాళ్ల జీతం కట్ అయిపోతుంది. ఊసురోమంటుంది ప్రాణం..!

పోనీ, నేనేమైనా కష్టపడి ఆయనకి సాయంగా ఉందామంటే, ఈ 'మధ్య వయసులో' ఏం పని చేయనూ అనిపిస్తుంది. పక్కింటివాళ్ల పేపర్ తిరగేస్తున్నప్పుడు 'సేల్స్‌మెన్ మేల్/ఫిమేల్ కావాలి అని ఎడ్వర్టయిజ్‌మెంట్ చూసినప్పుడు మనసు కొట్టుకుపోయింది. బస్సు ఛార్జీలు అన్నీ పోనూ రెండున్నర వేలు వచ్చినా వచ్చినట్టే కదా అనే ఆనందం క్షణంసేపు నిలవనీయలేదు.

ఆయనతో చెప్తే గట్టిగా తిట్టారు. "నువ్వు చదివిన టెన్త్ క్లాస్‌కి సరైన ఉద్యోగమే! కానీ హిందీ, ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడాలి. ఇంటింటికీ తిరిగి, గడప గడపకీ మొక్కి 'అమ్మా! అయ్యా! మా వస్తువులు కొనండి, నాయనా!' అని అడుక్కోవాలి. అలా అడుక్కోటానికి పోతానంటే ఫో! నీ మొగుడు చచ్చాడని ఫో!" అన్నారు.

ఆయన బాధని అర్థం చేసుకున్నా. కళ్లెంట నీళ్లు తిరిగాయి.

మధ్యతరగతి మెట్టు నుంచి కిందకి జారి బ్రతకటం కంటే మించిన దీనమైన పరిస్థితంటూ మరొకటి ఉండదేమో...!

ఇంటి వెనుక కొండలు కొడుతున్న కూలీల్ని చూసినప్పుడల్లా అనిపిస్తుంది ... పోనీ, ఈయన అటు ఆఫీసుకెళ్లగానే నేను కూలీ పనికి వెళ్తే? రోజుకు ఏభై వస్తుంది. అంటే నెలకు వెయ్యిన్నర ... ఇంటద్దె పోతే, ఆయన మొత్తం జీతం ఇంటి ఖర్చులకి సరిపోతుంది కదా! ఆశ రెపరెపలాడి అప్పుడే ఆరిపోతుంది.

సేల్స్‌కే వెళ్లనీయని ప్రిస్టేజ్, రాళ్లు కొట్టడానికి అడ్డం రాకుండా ఎలా ఉంటుంది?


నా మనసులోని ఉద్దేశం తెలిస్తే ఆయన నన్ను కొట్టను కూడా కొడతారు ... కోపంతో కాదు, పట్టలేని బాధతో, ప్రేమతో, అసహాయతతో! నాకు తెలుసు ఆయన మనస్తత్వం.

నాకు గట్టిగా ఏడవాలనిపిస్తోంది పక్కింటి వాళ్లకి వినిపిస్తుందని నిశ్శబ్దంగా, ఘోరంగా రోదిస్తా. నా వెక్కిళ్లు నాకే వినిపించనంతగా నోరు నొక్కుకుంటూ ఏడుపు ఆపుకుంటూంటా.

ఇప్పుడూ అదే జరిగింది. కానీ ఆరుబయట కూర్చున్న సంగతి గుర్తొచ్చి, వెంటనే చెంగుతో కళ్లు తుడుచుకున్నా.

గడ్డం కింద చెయ్యి పెట్టుకుని శూన్యంలోకి చూస్తూ గతమంతా మళ్లీ నెమరేసుకున్నా.

నా బాల్యం మధ్యతరగతి కుటుంబం, తెలుగు మీడియంలో చదువుకున్న టెన్త్‌క్లాస్ ... 'వాచీల కంపెనీలో టెక్నీషియన్'గా పర్మెనెంట్ జాబ్ వరుడు



అంటూ పెళ్లి సంబంధం రావడం, వాళ్లు చూసి పెళ్లికి ఒప్పుకోవడం ... అప్పుచేసి నా పెళ్లి చేసిన నాన్న, నా భారం దింపుకుని మరో అప్పుభారం నెత్తినేసుకోవటం ... కాపురం, ఇద్దరు పిల్లలు ... ఆయన ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో టీవీ, ఫ్రిడ్జ్, టూ ఇన్ వన్, సోఫాసెట్, స్కూటర్ కొంటుంటే ... 'నాకేమిటి, నా మొగుడు సంపాదిస్తున్నాడని...' ధీమాతో సుఖంగా గడిచి పోతుంటే ... ఉపద్రవంలా ఉద్యోగం పోవటం...

తుఫాన్‌కి రాష్ట్రమంతటా కొట్టుకు పోయినలాంటి తాకిడిలా, కుటుంబాలన్నీ అల్లకల్లోలమైపోయాయి.

తన బాధ ఎవరికి చెప్పుకుంటుంది? చెప్పుకుంటే మాత్రం తీర్చే వారెవరు?

"ఏమ్మా .... పనైందా?" లక్ష్మమ్మ దూరంగా ఏదో పని చేస్తూ అడిగింది.

నే నీ లోకంలోకొచ్చా.

లక్ష్మమ్మ వాచ్‌మన్ పెళ్లాం. మా ఇంటికెదురుగా కొంచెం దూరంలో ఎవరో ఇల్లు కట్టిస్తున్నారు. అక్కడే గుడిశెలాగా ఓ గుడారం వేసుకుని ఉంటారు లక్ష్మమ్మ, వాళ్లాయన. కనిపించినప్పుడల్లా పలకరిస్తూంటుంది.


'కాసేపు లక్ష్మమ్మతో మాట్లాడి వస్తే అయినా బావుణ్ణు' అనిపించి గేటు గడియేసి వెళ్లాను.

"ఎంతవరకు వచ్చింది ఇంటి పని?" అడిగాను.

"అవుతోందమ్మా ... రూఫ్‌కాడికొచ్చింది. గోడలు లేపాల!" అంది.

బేస్‌మెంట్ మీద కూర్చుంటూ అడిగా "మీ ఆయనకెంతిస్తారు?" అని.

"ఎన్మిదొందలమ్మా. ఖాళీ ఇల్లు కావలాకిస్తారు. 'నాకేమో ఇసుకపట్టి, రూఫ్పూ, గోడలూ తడిపినందుకు ఏడొందలిస్తారు."




"మొత్తం పదిహేనొందలొస్తోందన్నమాట!" అన్నాను లెక్కకడుతూ.

"అవ్వమ్మా! పగలు వాచ్‌మన్ అక్కర్లేదు కదమ్మా, నేనుంటాగా సూసుకోడానికి! అందుకని పగలు పళ్లూ, కూరలూ అమ్ముకొస్తాడు."

"ఎంతొస్తుంది?" వెంటనే అడిగా.

"రోజుకు ఏభై మిగులుద్ది!" చెప్పింది.

"అంటే నెలకు మూడు వేలదాకా సంపాయిస్తున్నారన్నమాట."

లక్ష్మమ్మ పళ్లన్నీ కనిపించేలా ఆనందంగా నవ్వింది. "ఔనమ్మా! నాకు పన్లేకపోతే గుబులొద్ది. అందుకే పన్లో పడతా. పనుంటే వుషారొస్తుంది నాకు. పగలంతా పనుండాల. సాయంత్రం మా ఆయన కాస్తంత కల్లు తెస్తాడు. తాగి, వేడన్నం తిని పడుకుంటే ప్రాణం ఎటో పోతుంది. మళ్లీ పగలు పనిలో పడాల!" అంతే జీవితం అన్నట్టు చెప్పింది హేపీగా.

అయితే ఈ హేపీనెస్ ఎన్నాళ్లు? ఈ ఇల్లు పూర్తయ్యేదాకానే కదా! అదే అడిగా.

"ఈ ఇల్లు అయిపోతుంటే మళ్లా ఇల్లు దొరకదామ్మా!?" 'అయ్యో పిచ్చిదానా!' అన్నట్టు అంది ఆశ్చర్యపోతూ.

"వెంటనే దొరుకుతుందా పని?"

"ఎందుకు దొరకదమ్మా, మస్త పన్లుంటాయి చేసుకోవాలే గానీ!" ధైర్యంగా అంది.

ఆమె మనస్థైర్యానికి మెచ్చుకోకుండా ఉండలేకపోయా. "ఎంత మిగుల్చుతావ్?" అడిగా మళ్లీ.

"ఏం ఉందమ్మా ఖర్చు, సగం డబ్బు ఊరికి పంపుతా. అక్కడ ఎకరం పొలం ఉంది, ఇల్లుంది. కాస్తంత అప్పయిందమ్మా ఆ మధ్య బిడ్డసంచీ ఆపరేషన్ అయి.... దానికి సిట్టి కట్టాల... అర్నెల్లు పోతే అదీ అయిపోద్ది!" చెప్పింది.

"మీకేమైనా సుస్తీ చేస్తే పని చేయలేకపోతే ఎలా బ్రతుకుతారు?" నా సమస్య వాళ్లకూ ఉంటుందని అడిగా.

"చాతకానప్పుడు ఏం చేస్తా మమ్మ ... ఊళ్లో పొలం చేయిపిస్తా ... ఇల్లమ్మేసి ఆ డబ్బు బాంక్‌లో వేసి బతుకుతాం. అప్పటిదాకా అయితే పని చేస్తాం కదమ్మా! కొన్నాళ్లు పోతే మా పోరల్ని మేస్త్రీ పనికి తోలిపిస్తాం. ఆ తర్వాత కోడలొచ్చి ఇంటి పనిచేసుకుపోతుంది. ముసలోళ్లం పడుకుంటాం!" నవ్వుతూ చెప్పింది.

లక్ష్మమ్మ ఎప్పుడూ నవ్వుతూనే ఉంటుంది. ఒక్కసారి కూడా ఆమె విచారంగా ఉన్నట్టు తోచదు.

ఆ నవ్వుకు కారణం భద్రత ... జీవితం పట్ల, భవిష్యత్తుపట్ల ఒక ప్లాన్. అటుదిటయినా, ఇటుదటు అయినా స్థిరత్వం మాత్రం చెదరదు.

నాలా పెన్షన్ లేదనీ, మెడికల్ ఫెసిలిటీస్ లేవని, ఇల్లు లేదని, పిఎఫ్ రాదని ... గవర్నమెంట్ అండ లేదనీ ... ఎవరూ లేరని అనిశ్చిత ఆమెకు లేదు.

కారణం... వాటిని ఆశించలేదు కాబట్టి. ఒకప్పుడు ఉన్నది ఇప్పుడు లేదనే బాధ లేదు కాబట్టి.

"వస్తా!" అంటూ లేచా.

"కాసేపు కూకోమ్మా...!" అంది.

"మళ్లీ వస్తాలే, వన్నూసుకో!" అంటూ వచ్చేశా.

లక్ష్మమ్మ ఆత్మస్థైర్యానికి అబ్బురమైంది. నిజమే, చిన్న జీవితం ... ఎంతలోకి అయిపోతుందని కాస్తంత ఓర్చుకుంటే ... కొన్నాళ్లు కష్టాలబండీ లాగిస్తే నా కొడుకు చేతికి రాడా ... కనీసం క్లర్క్‌గా అయినా మరో నాలుగు వేలు తేడా?

ఆ రియల్ ఎస్టేట్‌వారిదగ్గర ఔట్‌స్కర్ట్స్‌లో కొన్న వంద గజాల స్థలం అమ్మేసి పిల్ల పెళ్లి చేయలేరా...?

ఆయన కాలూ చేయీ ఆడుతున్నంతకాలం నన్ను పోషించుకోరా?!

రోగమొస్తే గవర్నమెంట్ ఆస్పత్రికి నడవటమే....

ఇలా అనుకున్నాక, నాకు నేను ధైర్యం చెప్పుకున్నాక ఎంతో హాయిగా అనిపించింది. గుండెలో కొండంత భారం దించుకున్నట్టనిపించింది.

'సముద్రంలో ఎంత నీరున్నా, మన పాత్రకొద్దీ మాత్రమే నీరు లభిస్తుంది' స్వామీజీ మాటలు గుర్తొచ్చాయి.

లక్ష్మమ్మ నవ్వూ గుర్తొచ్చింది.

నా బాధ చిన్న గీతలా మారిపోయింది తమాషాగా! ■